'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## కేంద్ర, రాష్ర్టాల కుమ్ములాట

**కేంద్రంలోని** బీజేపీ ప్రభుత్వం, వివిధ రాష్ర్టాల్లోని విపక్ష పాలిత ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం కేసుల పర్వం నడుస్తున్నది. జానపద సినిమాల్లో వలె 'ఈ బ్రహ్మాస్ర్తాన్ని కాచుకో' అని ఒకరంటే.. 'నేను సంధించే పాశుపతాస్ర్తాన్ని నువ్వు కాచుకో' అని మరొకరు అంటున్నారు. కేంద్రం తన అమ్ములపొదిలో ఉన్న ఈడీ, ఐటీ, సీబీఐలను రాష్ట్ర ప్రభుత్వాలపైకి ఎక్కుపెడుతుంటే.. 'నేనేమీ తక్కువ తిన్నానా' అంటూ ఏసీబీ, విజిలెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపైకి సంధిస్తున్నాయి. సంయమనంతో సమన్వయపర్చాల్సిన కేంద్రం రాష్ర్టాలపై దాయాదిలా కయ్యానికి కాలుదువ్వడం సమస్యగా మారుతున్నది. దేశంతోపాటు రాష్ర్టాలపైనా తన ఆధిపత్యమే ఉండాలన్న మోదీ సర్కారు మొండి ధోరణి ఈ సమస్యకు మూలమని చెప్పాలి. రాష్ర్టాల్లోని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో జాతీయపార్టీలు ఘోరంగా విఫలమైన తర్వాత ప్రాంతీయ పార్టీలు రంగం మీదకు వచ్చి సత్తా చాటుకున్న సంగతి తెలిసిందే. ఢిల్లీకి, గల్లీకి మధ్య ఏర్పడిన అంతరమే ఇందుకు కారణం. దశాబ్దాలుగా జాతీయ పార్టీలు సృష్టించిన శూన్యాన్ని ప్రాంతీయ పార్టీలు భర్తీ చేశాయి.

కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాఖ్య విధానం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నది. రాష్ర్టాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిరపరచడం, ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్రసంస్థలను ఉసిగొల్పి విపక్ష నేతలను తనవైపు తిప్పుకోజూడటం, రానన్నవారిని వేధించడం తెలిసిందే. దీంతో తప్పనిసరి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మరక్షణకు తమ వద్ద ఉన్న ఆయుధాలనూ బయటకు తీస్తున్నాయి. ఇది చాన్నాళ్లుగానే సాగుతున్నప్పటికీ ఎన్నికలు సమీపించిన వేళ కొంత శ్రుతిమించుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఢిల్లీ-గల్లీ ఘర్షణల్లో పార్టీలకూ, ప్రభుత్వాలకూ మధ్య సన్నని విభజన రేఖ క్రమంగా చెరిగిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర అధికార పార్టీల మధ్య వైషమ్యాలు కాస్తా ప్రభుత్వాల మధ్య యుద్ధంలా మారుతున్నాయి. ఇది అంతిమంగా పరస్పర కేసుల నమోదుకు దారితీస్తుండటం ఓ విపరిణామం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలాలు, బలగాలు, అధికార పరిధులను రాజ్యాంగం స్పష్టంగానే నిర్దేశించింది. వాటిని ఒకరి మీద మరొకరు మోహరించుకుంటున్నారు. అవసరమైతే ప్రయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియోకు సంబంధించి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై ఢిల్లీలో కేసు నమోదైంది. అందుకు ప్రతిగా అమిత్ షా చిన్నారితో ఎన్నికల ప్రచారం చేయించారనే ఆరోపణలపై హైదరాబాద్‌లో కేసు నమోదు చేశారు. ఇవేకాకుండా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పై ఢిల్లీ నుంచి ఈడీ కేసులు నడిపితే.. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. బెంగాల్ గవర్నర్ వ్యవహారం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్ ఆ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య పొసగని విషయం తెలిసిందే. ఆయన తర్వాత బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనందబోస్ రాష్ట్ర ప్రభుత్వానికి సమాంతరంగా మరో ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు, మమతా బెనర్జీ సర్కార్ నిర్ణయాలను అడుగడుగునా అడ్డుకుంటున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఓ మహిళ గవర్నర్ బోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం దుమారం రేపుతున్నది. చట్టపరమైన పరిమితుల కారణంగా దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయనప్పటికీ పోలీసు దర్యాప్తు ప్రారంభం కావడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వైషమ్యాలు దీంతో కొత్త మలుపు తిరిగినట్టయింది. ఈ ఉదంతం ఆధారంగా బెంగాల్ మంత్రులు గవర్నర్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మరోవైపు తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేయగా.. లంచం ఆరోపణలపై ఈడీ అధికారి అంకిత్ తివారీని ఏకంగా విజిలెన్స్ అధికారులు అరెస్టు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ తరహా దెబ్బకు దెబ్బ అనే రీతిలో జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ఘర్షణల వల్ల దేశంలో అవాంఛనీయ వాతావరణం నెలకొంటున్నది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు ప్రవేశం నిరాకరించే పరిస్థితి ఏర్పడుతున్నది. ఇది దేశానికి ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. మన దేశం భిన్న సంస్కృతులు, భాషలకు నిలయం. అందుకే రాజ్యాంగకర్తలు సమాఖ్య విధానాన్ని మనకు అందించారన్నది అన్ని పార్టీలూ, ముఖ్యంగా బీజేపీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## నగదు రహిత వైద్యం అందించాలె

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన వారధిగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే.. లక్షలకు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తున్నది. సమయానికి నగదు చేతిలో లేక అనేకమంది అవస్థలు పడుతున్నారు.**

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన హెల్త్‌కార్డులను కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ దవాఖానలు నిరాకరిస్తుండటంతో ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. హెల్త్‌కార్డుల ద్వారా నగదురహిత వైద్యం పొందే సదుపాయం లేకపోవడంతో ముందుగా నగదు చెల్లించి వైద్యసేవలు పొందాల్సి వస్తున్నది. మొదట సేవలందుకొని తర్వాత రీ యింబర్స్‌మెంట్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ముందుగా చెల్లించేందుకు డబ్బులు అందుబాటులో లేక నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. పైగా రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు ఖర్చయితే రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షలు మాత్రమే ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుండటం విచారకరం.

తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలనే ప్రతిపాదన ఎప్పటినుంచో ఉన్నది. రాష్ట్రంలో నగ దు రహిత వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు, ఉద్యో గ, ఉపాధ్యాయ ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఒకరిని తీసుకొని కార్పస్ ఫండ్ ఏర్పాటుచేసి ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని ప్రతిపాదనలను రూపొందించారు. తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాల ఆధ్వర్యంలో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పం దించారు. అయితే సంబంధిత ఆదేశాలు జారీ అయ్యేలోపే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి.

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో నగదు రహిత వైద్యం నిర్ణయం అటకెక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి, అధికారులు వీలైనంత త్వరగా ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని ప్రైవేటు, కార్పొరేట్, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానల్లో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, వారి పై ఆధారపడిన కుటుంబసభ్యులకు కూడా నగదు రహిత వైద్యం అందేలా ఆరోగ్య భద్రతకార్డులను మంజూరు చేయాలి.

**- డాక్టర్ ఎస్. విజయభాస్కర్, 92908 26988**

# పెట్టుబడిలో వ్యవ'సాయం' పెరుగాలె

**2015లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు కఠినంగా ఉన్నప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతు రుణమాఫీ పథకాన్ని పలు దఫాలుగా అమలుచేసింది. 2018 వరకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేసింది. కానీ అప్పుడు ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ విషయంలో ప్రజలను పక్కదోవ పట్టిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై విషం చిమ్మింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ ఏమో కానీ, కనీసం లక్ష రూపాయల రుణమాఫీని కూడా చేయలేకపోయింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ. ఇదిలా ఉంటే ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నది.**



**కన్నోజు శ్రీహర్ష**

నేడు దేశంలో తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి నెలకొని ఉన్నది. కేంద్ర ప్రభుత్వం కనీసం పన్నులను సైతం సక్రమంగా రాష్ర్టాలకు బదిలీ చేయడం లేదు. ఇలాంటి పరిస్థితిలో రుణమాఫీ విషయమై ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్బీఐని ఎలా ఒప్పిస్తుందో అంతుచిక్కడం లేదు. నాబార్డ్ నివేదిక ప్రకారం 2023 ఆగస్టు వరకు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది రైతులు రుణాలు తీసుకొని ఉన్నారు. ఆ రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయాలంటే దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్య సంస్థ కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి షరతులు విధించింది, ఆర్బీఐ రుణ మాఫీలకు అనుమతిస్తుందా? అసలు రైతు రుణమాఫీలు ఎలా జరుగుతాయో ఒకసారి చూద్దాం.



1970లలో వ్యవసాయరంగంలో విప్లవాలు సృష్టించడానికి నాటి ప్రభుత్వాలు రైతులపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. తత్ఫలితంగా జొన్నలు, రాగులు పండించే స్థానంలో వరి వేయడం రైతులకు ఆనవాయితీగా మారింది. కానీ, వారికి పెట్టుబడి ఇబ్బందిగా మారింది. దానికోసం రుణాలను తీసుకునేందుకు రైతులు బ్యాంకులను ఆశ్రయించడం మొదలు పెట్టారు. కానీ, రైతులకు బ్యాంకుల మధ్య సమన్వయ లోపం తలెత్తింది. రుణాలు పొందిన రైతులు అసలు ఏం పండించాలి? పండించిన దానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందా? పంట నష్టపోతే బీమా సౌకర్యాన్ని కల్పిస్తారా? వంటి అనేక ప్రశ్నలు రైతులను ఆలోచింపజేశాయి. కానీ, అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగంలో సరైన విధానాలు రూపొందించకపోవడం వల్ల రైతులు అనేకరకాలుగా నష్టపోయారు. గ్రామీణ వ్యవసాయరంగంపై దళారుల కన్నుపడింది. చిన్న, సన్నకారు రైతులను లోబర్చుకొని దళారులు నేరుగా రుణాలివ్వడం షురూజేశారు. తద్వారా అప్పు కోసం రైతులు బ్యాంకులను ఆశ్రయించడం మానేసి దళారుల వద్ద బారులు తీరారు. ఆ విధంగా గ్రామీణ వ్యవసాయరంగం, రైతులు పక్కదారి పట్టారు. దీన్ని అదనుగా చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రుణాలు మాఫీ చేస్తామంటూ ముందుకు వచ్చాయి. క్రమంగా రుణమాఫీ అనేది ఒక వ్యసనంగా మారింది. కొద్దిమంది రైతులకు ప్రభుత్వాలు రుణమాఫీ చేయడం, కొందరికి చేయకపోవడం వల్ల దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. ముఖ్యంగా కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలు తీవ్రమయ్యాయి.

కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రాష్ర్టాల ఆర్థిక పరిస్థితిపై భారం పడే విధంగా వ్యవహరించింది. 2015-16 నాటికి అప్పటి ఆర్బీఐ గవర్నర్ రఘురాం రాజన్ రుణమాఫీలపై కీలక ప్రకటన చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే విధంగా చర్యలు ఉండాలని కొన్ని నిబంధనలను అమలుచేశారు. 14వ ఆర్థిక కమిషన్ కూడా ఆర్థిక పరిస్థితిపై ఆరా తీసింది. 2015-16లో ఆర్బీఐ ఇకనుంచి దేశంలోని అన్ని రాష్ర్టాల్లో రుణమాఫీలు చేయటం అసాధ్యమని, పలు రాజకీయ పార్టీలకు రుణమాఫీ ఒక ఎన్నికల స్టంట్‌గా మారిందని వివరించింది. అందుకే దేశంలోని పలు రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు రుణమాఫీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రుణమాఫీని అమలుచేయలేకపోయాయి. పొరుగు రాష్ట్రమైన ఏపీలోనూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రుణ మాఫీ హామీ ఇచ్చి అమలు చేయలేకపోయారు. ఇదే సమయంలో దేశంలో పెద్దనోట్లు రద్దయ్యాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని కూడా అమలుచేసింది. ఇలాంటి క్లిష్ట సమయంలోనే తెలంగాణ రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు దఫాలుగా లక్ష రూపాయల రుణమాఫీ చేసింది.

ప్రపంచ వాణిజ్య సంస్థలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉన్నది. అందుకే రైతులకు దేశ జీడీపీలో 10 శాతం కంటే ఎక్కువ ఇవ్వడానికి వీల్లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ వ్యవసాయ ఒప్పందంలో భాగంగా 3 బాక్సులు (ఆకుపచ్చ, నీలం, కాషాయం) ఉంటాయి. ఎక్కువ ప్రభావం ఉండే విధానాలు కాషాయ బాక్సులోకి వస్తాయి. రైతు రుణమాఫీ కాషాయ కోవలోకి చెందినదే. రుణమాఫీ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉండటం వల్ల ప్రపంచ వాణిజ్య సంస్థ సైతం మన దేశంపై పలు షరతులు విధించింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సంఘం కూడా రుణమాఫీని ప్రోత్సహించడం లేదు.

**నీతి ఆయోగ్ కూడా రైతు రుణమాఫీ బదులు రైతులకు పెట్టుబడి పెట్టే విధానాలను తీసుకురావాలని ఆదేశించింది. కేసీఆర్ నేతృత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటువంటి పథకాలనే తీసుకొచ్చింది. ఆ ప్రభుత్వం రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తునందించింది. నిరంతర నీటి సరఫరా చేసింది. రైతు వేదికలను నిర్మించింది. రైతు బంధు రూపంలో పెట్టుబడిని అందించే విధానాన్ని తీసుకురావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగింది.**

గత కేసీఆర్ ప్రభుత్వం వలె దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందజేస్తే వాళ్లకు రుణాలు తీసుకోవలసిన అవసరం ఎందుకు ఉంటుంది? పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే వాళ్లు అప్పులెందుకు చేస్తారు. పండించిన పంటకు బీమా సౌకర్యం కల్పిస్తే రైతులు బ్యాంకుల వద్ద ఎందుకు క్యూలో నిల్చుంటారు? మొత్తంగా దేశంలో ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలను అనుసరిస్తూనే వ్యవసాయరంగంలో ఎప్పటికప్పుడు సరికొత్త ఆలోచనలను జోడిస్తే అసలు ఈ రుణమాఫీలనేవే ఉండవు.

**గత కేసీఆర్ ప్రభుత్వం వలె దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందజేస్తే వాళ్లకు రుణాలు తీసుకోవలసిన అవసరం ఎందుకు ఉంటుంది? పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే వాళ్లు అప్పులెందుకు చేస్తారు. పండించిన పంటకు బీమా సౌకర్యం కల్పిస్తే రైతులు బ్యాంకుల వద్ద ఎందుకు క్యూలో నిల్చుంటారు? మొత్తంగా దేశంలో ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

# బీజేపీ పట్ల ఈసీ పక్షపాతం

**2024 సార్వత్రిక ఎన్నికలను పరిశీలించేందుకు భూటాన్, మంగోలియా, ఆస్ట్రేలియా, మడగాస్కర్, రష్యా, నేపాల్, శ్రీలంక, మాల్దీవులు, నమీబియా తదితర 23 దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులు దేశంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఎన్నికలు నిర్వహిస్తున్న తీరుపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. బీజేపీ చేస్తున్న విద్వేష ప్రసంగాలపై చర్యలు తీసుకునేందుకు ఈసీ నిరాకరించడం, ఎన్నికలు ముగిసిన వెంటనే పోలింగ్ వివరాలను వెల్లడించకపోవడం వంటి కారణాల వల్ల ఎలక్షన్ కమిషన్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నదని ఇటు రాజకీయపార్టీలు, అటు పౌర సమాజం నుంచి ఆరోపణలు వినవస్తున్నాయి. అంతేకాదు, ఓటు ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానాలకు ఈ ఆరోపణలు తావిస్తున్నాయి.**



**కైసర్ అంద్రాబీ**

కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఎన్నికలను పరిశీలించేందుకు మన దేశానికి వచ్చిన విదేశీ ప్రతినిధుల నుంచి ఈసీ ధ్రువీకరణను కోరడంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కమిషన్‌పై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లడం, అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు పెరుగుతుండటం వల్లనే కేంద్రం విదేశీ ప్రతినిధులను ఆహ్వానించిందని విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల్లో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో విదేశీ పరిశీలకులను ఆహ్వానించినట్టు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ చెప్తున్నారు. ఎన్నికల నిర్వహణలో ఉన్నత ప్రమాణాల పట్ల భారత నిబద్ధతను ఇది చాటుతున్నదని ఆయన పేర్కొన్నారు. 'మన సువ్యవస్థిత పారదర్శక ఎన్నికల విధానాలకు అనుగుణంగానే ఇదంతా జరుగుతున్నది. ఎలాంటి దాపరికాలు లేనటువంటి పటిష్ఠమైన పద్ధతిలోనే మేం పని చేస్తున్నాం' అని రాజీవ్ కుమార్ అన్నారు.

దశాబ్దాలుగా నిర్మించిన న్యాయమైన ఎన్నికల ప్రక్రియను ఎన్నికల కమిషన్ నాశనం చేస్తున్నదని టీఎంసీ చట్టసభ సభ్యు డు సాకేత్ గోఖలే ఇటీవల 'ఎక్స్'లో ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైన ఏప్రిల్ 19కి కొన్ని వారాల ముందు ఎలాంటి కారణం లేకుండానే ఎలక్షన్ కమిషనర్లలో ఒకరు తన పదవికి రాజీనామా చేశారు. మరొకరు పదవీ విరమణ పొం దారు. ఈ పరిణామాల అనంతరం మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. రోజుల వ్యవధిలోనే ఆ ఖాళీలను భర్తీచేసింది. అయితే ఈ చర్య సుప్రీంకోర్టు పరిశీలనలోకి వచ్చే అవకాశాలున్నాయి. 2019లో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అధికార పార్టీ పట్ల స్వతంత్ర సంస్థ ఈసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నదని అనేక సందర్భాల్లో రాజకీయపార్టీలు, పౌర సమాజం ఎత్తిచూపాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేసినందుకు, ప్రతిపక్ష కాం గ్రెస్ మ్యానిఫెస్టో గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకుగానూ మోదీ ఇటీవల అంతర్జాతీయంగా విమర్శలను ఎదుర్కొన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలను ఉల్లంఘించారని తీవ్రమైన విమర్శలు వచ్చిన కొద్దిరోజుల తర్వాత ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నట్టు విమర్శకులు గుర్తించారు. అది కూడా మోదీకి బదులుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈసీ లేఖ పంపింది.


ఎన్నికలకు ముందు సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ నిర్వహించిన సర్వేను ప్రస్తావిస్తూ... 2019-2024 ఎన్నికల మధ్యకాలంలో ఎలక్షన్ కమిషన్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని రాజకీయ విశ్లేషకురాలు ఆరతీ జెరాత్ పేర్కొన్నారు. విభజన ప్రసంగాలపై చర్యలు తీసుకోకపోవడం, ఓటింగ్ శాతాలకు సంబంధించి న డాటా విడుదలలో ఎన్నికల కమిషన్ వైఫల్యాలపై ఆమె స్పందించారు. ఉద్వేగభరితమైన ప్రసంగాలు మీడియాలో ముఖ్యాంశాలు గా రావడం, ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం లాంటి చర్యలు విదేశీ ప్రతినిధులు కూడా కాపాడలేని విధంగా ఎలక్షన్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ పాత్ర పూర్తిగా దిగజారిందని ఎంపీ, సీనియర్ విపక్ష నేత డెరెక్ ఓ బ్రయన్ ఆరోపించారు.




ప్రస్తుత ఎన్నికల తొలి రెండు దశల తుది ఓటింగ్ శాతాల విడుదలలో ఎన్నికల కమిషన్ సరైన వివరణ లేకుండానే రోజుల కొద్దీ జాప్యం చేయడం ఓటర్ల మదిలో తీవ్రమైన అనుమానాలకు తావిస్తున్నది. జాప్యానికి గల కారణాలను తెలపాలని, వివరణ ఇవ్వాలని కోరుతూ డెరెక్ ఓ బ్రయన్ ఈసీకి లేఖ రాశారు. 'ఇటువంటి అనుమానాలను నివృత్తి చేయడంలో కమిషన్ వైఫల్యం ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

మోదీ చేస్తున్న ముస్లిం వ్యతిరేక ప్రసంగాల పట్ల చర్యలు తీసుకోకుండా ఉండటమే కమిషన్ వైఫల్యానికి నిదర్శనమని రచయిత, కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి సంజయ్ ఝా పేర్కొన్నారు. 'ఎన్నికలలో పోటీ చేయకుండా మోదీని కమిషన్ నిషేధించి, ఇకపై ప్రచారం చేయకుండా ఆపాల్సింది' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం సభ్యులకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించేందుకు వారిని ఎంపిక చేసే వ్యవస్థను కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాజకీయ జోక్యం కారణంగా ఎన్నికల వ్యవస్థలు అవకతవకలకు గురవుతాయని పాకిస్థాన్‌ను ఝా ఉదహరించారు. 'పాక్ ఉదాహరణ ప్రతి దేశానికి గుణపాఠం లాంటిది. ప్రత్యేకించి రాజకీయ జోక్యం తగ్గకపోతే ఎన్నికలు అవకతవకలకు గురవుతాయి' అని ఆయన పేర్కొన్నారు.

**దక్షిణాసియాలోని వివిధ దేశాల ఎన్నికల సంస్థలు కూడా రాజకీయ పక్షపాత వైఖరికి సంబంధించిన ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల సంఘంపై విశ్వాసం లేకపోవడంతో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఈ ఏడాది జరిగిన ఎన్నికలను బహిష్కరించింది. పాకిస్థాన్‌లో ఫిబ్రవరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విస్తృతంగా ఓట్లు తారుమారు చేశారన్న ఆరోపణలపై ఆ దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పదేపదే డిమాండ్ చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ కూడా విదేశీ ప్రతినిధులను తమ ఎన్నికలను పరిశీలించేందుకు అనుమతించాయి. అయితే మన దేశంలోనూ రకరకాల ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈసీ ఏ రకమైన చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉన్నది.**




## మోదీకి గుణపాఠం తప్పదు!



*'నమస్తే' చెప్పకముందే తన చుట్టూ తెచ్చిపెట్టిన జన సమూహాలు ఆవిరైపోతాయన్న వాస్తవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల ద్వారా మోదీ గ్రహిస్తారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదు. ఈ విషయాన్ని మోదీ గ్రహించకపోవడం ఆశ్చర్యకరం.*

**- సుబ్రమణ్య స్వామి,** *బీజేపీ సీనియర్ నేత*